
చిత్రాలు: సి.ఎస్.బాబు



# గణాచారి

మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢ నమ్మకాలు, దురాచారాలు, దోపిడీలపై యుద్ధం సాగించడానికే కలం పట్టిన రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి.



ఇంటిమీద కాకి వాలకుండా ఆస్తిని కాపాడుకుంటూ వచ్చింది. సమస్యలు ఎదురైనప్పుడల్లా మంగమ్మను ఆమె నోరే ఆదుకుంది.

"మళ్ళీ నీకిదేం బుద్ధిరా?" చలపతి కొయ్య పెట్టె తెరిచి పెళ్ళినాడు అత్తగారు పెట్టిన అత్తాకోడలంచు కండువా తీసి భుజం మీద వేసుకోబోతూ ఆగిపోయాడు. వెనక నిల్చున్న తల్లి వాలకం మనసులో మెదలుతూ ఉంటే గుండె దడదడలాడింది.

"పెద్ద దాన్ని ఎందుకు చెప్తున్నానో విను. పెద్దవాళ్ళ మాట విని చెడ్డవాళ్లు లేరు."

కెనడియన్ ఇంజన్‌లా మంగమ్మ చేస్తున్న రొదకు చలపతి హృదయం కాలవ మీద వంతెనలా గజగజలాడిపోయింది.

"నువ్వా గడప తొక్కితే నీకూ నాకూ ఇక ఇంతే!"

మంగమ్మ నోరంటే నోరు కాదు. మనిషి కంటే నోరే పెద్దది.

మంగమ్మకు ఇరవై ఏళ్లు నిండకుండానే భర్త పోయాడు. ఆమె అదృష్టం బాగుండి అప్పటికే ఓ కాయ కాసింది.

మంగమ్మ భర్త పోయాడనే వార్త అందడమే ఆలస్యంగా పిండాకూడు చుట్టూ చేరే కాకుల్లా అయినవాళ్లూ, కానివాళ్లూ మంగమ్మ చుట్టూ వచ్చి చేరారు. పోటీల మీద మంగమ్మను ఆదుకొనే ప్రయత్నాలు చేశారు.

"ఆడకూతురు. చిన్న వయసు. భర్త చచ్చి పుట్టెడు దుఃఖంలో ఉంది. ఇరవై ఎకరాల మాగాణి - చేడ్లూ-దోవలూను. ఎవరూ ఆదుకోకపోతే ఏమైపోతుంది?" ఆమె చుట్టూ చేరిన వాళ్ల ఆలోచనలు ఇలా ఉంటే-

మంగమ్మకు మాత్రం వాళ్ల సహాయం అక్కర లేదనిపించింది.

'వెధవ సంత. గుంటనక్కలు. తేరగా వచ్చిందని మింగడానికి చేరారు. వీళ్ళంతా తనకు సహాయం చెయ్యడానికి వచ్చారా? గద్దలా అందినంతవరకు తన్నుకెళ్ళడానికి వచ్చారు. తన దగ్గరా వీళ్ల వేషాలు?' వాళ్ళ మాటలు వింటూ మనసులో అనుకొనేది మంగమ్మ.

పెద్దదినం కాగానే ఎక్కడి వాళ్ళ నక్కడ తరిమేసింది. పుట్టింటివాళ్ళను కూడా నమ్మలేకపోయింది.

'ముదనష్టపోళ్ళు. అయినకాడికి ఏనుకుపోదామని తగలడ్డారు. మాయదారి సంత. పీడా విరగడైంది.' మంగమ్మ మెటికలు విరిచింది.

పాతికేళ్లుగా మంగమ్మ ఇంటిమీద కాకి వాలకుండా ఆస్తిని కాపాడుకొంటూ వచ్చింది. సమస్యలు ఎదురైనప్పుడల్లా మంగమ్మను ఆమె నోరే ఆదుకుంది.

ఆ నోటికి భయపడే అటు అత్తింటి వాళ్లు, ఇటు పుట్టింటివాళ్ళు భళ్ళున వగలేసిన కుండపెంకుల్లా చెల్లాచెదరైపోయారు.

ఆమె కొడుకు చలపతిని పెద్దపులుల్లా నోరు తెరుచుకొని ఉన్న వారసుల నుంచి ఆ నోటితోనే కాపాడుకొంటూ వచ్చింది. అంతేకాదు. కొడుకును కొంగుచాటునే పెంచింది. బయటి ప్రపంచం తెలియకుండా పెంచింది. బడికి పంపకుండా ఇంట్లోనే పంతుల్ని పెట్టి రాయడం, చదవడం నేర్పించింది. బయటికి వెళితే తన కొడుకును తనకు కాకుండా చేస్తారనే భయం పట్టుకుంది మంగమ్మకు. చలపతి మంగమ్మ కొడుకుగానే పెరిగి పెద్దవాడయ్యాడు.

లోకం పోకడ తెలియని చలపతి - ఆడ పెత్తనంలో పెరిగిన చలపతి నాసిరకం వాజమ్మలా తయారయ్యాడు.

పాతికేళ్ళు నిండిన చలపతికి మంచి సంబంధమే చూసి పెళ్ళి చేసింది మంగమ్మ. భద్రయ్యకు ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ. ఊళ్ళో సంబంధం అని, కూతురు తన కళ్లముందే ఉంటుందని చలపతి కిచ్చి రంగరంగ వైభవంగా పెళ్లి చేశాడు భద్రయ్య.

అల్లుడి కిస్తానన్న ఐదెకరాల మాగాణి కూతురి పేర రాశాడు భద్రయ్య. దానికి కారణం లేకపోలేదు. కూతురు పుట్టినప్పుడు తెనాలి వెళ్ళి జాతకం రాయించాడు. జాతకం చూసిన సిద్ధాంతి ఆమెకు వైధవ్యం ఉందనీ, సంతానయోగం కూడా లేదనీ చెప్పాడు. భద్రయ్య గుండె చెరువయింది. ఆ జాతకం అక్కడే చింపి పారేశాడు. ఆ రహస్యం భార్యకు కూడా చెప్పకుండా గుండెలోనే దాచుకొన్నాడు.

భద్రయ్య తన కొడుక్కి ఇస్తానన్న పొలం కూతురి పేర రాశాడన్న వార్త మంగమ్మ చెవిన పడింది.

మంగమ్మకు అరికాలి మంట నెత్తికెక్కింది. ఆమె నోటికి పని తగిలింది.

'ఔరా భద్రయ్యా! ఎంత గుండెలు తీసిన బంటువురా? నా కొడుక్కి ఇస్తానన్న పొలం నీ కూతురి పేర రాస్తావా? నా కొడుకు అమాయకుడనేగా నీ ధీమా? నాకు అడిగే దిక్కు లేదనేగా నీ ధైర్యం? నేనూ

చూపిస్తా ఈ మంగమ్మంటే ఏమిటో?'

కోడల్ని పంపించవద్దని భద్రయ్యకు కబురు పంపింది.

"పోనియ్యమ్మా! ఎవరి పేర ఉంటేనేం? ఎటు తిరిగీ తినేది నీ కొడుకు బిడ్డలేగా?" అన్నాడు భద్రయ్య రాయబారిగా వచ్చిన రామయ్య.

"చాల్లేవయ్యా మహా చెప్పొచ్చావ్? ఆ గడ్డి ఏదో ఆ భద్రయ్యకే పెట్టకపోయావ్? ఆడదాన్ననీ, ఒంటరి దాన్ననీ ఆ వార్త నాదాకా మోసుకొచ్చావా? ఏం పెద్ద మనిషివయ్యా?" గఃయ్యిన లేచింది మంగమ్మ.

మంగమ్మ నోటి ధాటికి తట్టుకోలేకపై పంచె దులిపి భుజాన వేసుకొని నిలబడ్డాడు వచ్చిన పెద్ద మనిషి.

"ఇదుగో రామయ్యా! మా చలపతి పేర ఆస్తి రాస్తాడా సరేసరి. లేదా కూతుర్ని శాశ్వతంగా ఇంట్లోనే పెట్టుకోమను. ఆఁ! తెగతెంపులు అయిపోయినట్లే నని చెప్పు" అన్నది మంగమ్మ.

చూస్తూ చూస్తూ కూతురి కాపరంలో బొగ్గులు చల్లడం భద్రయ్యకు బాధ కలిగించింది. 'కానీ, అల్లుడి పేర ఆస్తి రాస్తే, రేపు అతడు కాస్తా గుటుక్కుమంటే కూతురి బతుకు ఏం కాను? అన్నదమ్ములు చూస్తారా?'

**కొడుకు తన పట్టు నుంచి జారిపోతున్నట్లు అని పించింది మంగమ్మకు. కోడలు గంగాభవాని మీద పళ్ళు నూరింది. భద్రయ్యను దుమ్మెత్తి పోసింది.**

కథ అడ్డం తిరిగింది. భద్రయ్య ససేమిరా అన్నాడు. మంగమ్మ మొండికేసింది. ఆ ఇంటికాకి ఈ ఇంటి మీద వాలడం లేదు. భద్రయ్య ఇంట్లో వాళ్లు మంగమ్మ ఉండే మెరక వీధికి రావడానికే భయ పడుతున్నారు. పొద్దున్నే అరకిలో బియ్యం అల్పాహారం కింద ఆరగించి, వాకిట్లో కూర్చుని వచ్చేపోయే వాళ్లను పిలిచి కూర్చోబెట్టి పంచాంగం విప్పుతుంది మంగమ్మ.

ఆరు నెలలు గడిచాయి. మొదటి మూడు నెలలూ మామగారి మీద అలగడం సరదాగానే అనిపించింది చలపతికి. రాను రాను భార్యా వియోగం భరించరానిదే అయింది. ఓ రోజు సాయంత్రం చలపతి మామగారు ఉండే వీధికి వెళ్ళాడు. ఇంటికి బాగా పొద్దు పోయాక వచ్చాడు. కొడుకు వాలకం చూడగానే మంగమ్మకు అర్థం అయింది.

"ఎక్కడ చచ్చావురా?" మంగమ్మ గుడ్లెర్ర జేసింది. చలపతి నీళ్లు నమిలాడు. దిక్కులు చూస్తూ బిక్కపోయి నిల్చున్నాడు.

"సిగ్గు లేకపోతే సరి. ఇకనుంచి చీకటి పడగానే ఇంటికి చావు" అన్నది మంగమ్మ మండిపడుతూ.

కొడుకు తన పట్టునుంచి జారిపోతున్నట్లు అనిపించింది మంగమ్మకు. కోడలు గంగాభవాని మీద పళ్లు నూరింది. భద్రయ్యను దుమ్మెత్తి పోసింది. ఆ రోజునుంచి మంగమ్మ కొడుకును వెయ్యి కళ్ళతో కనిపెడుతూ ఉంది.

ఒకరోజు వీధి భాగవతం చూసి వస్తానని వెళ్ళిన చలపతి మామ గారింటికి వెళ్ళాడు. తెలతెలవారుతూ ఉండగా ఇంటికి చేరాడు.

అల్సేషియన్ డాగ్ లాంటి మంగమ్మ, కొడుకు ఎక్కడి కెళ్ళాడో ఇట్టే వాసన పట్టేసింది.

తెల్లవారి కొడుకు చేతికి ఓ ఏభై రూపాయల నోటు అందించి అన్నది- "తెనాలి వెళ్ళి సినిమా చూసి సర్దాగా తిరిగి రారా నాయనా!"

ఏనాడూ తల్లి చలపతి చేతిలో పది రూపాయలు పెట్టి ఎరగదు. ఒక్కసారి ఏభై రూపాయల నోటు చేతిలో పడగానే చలపతి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

ఇప్పుడు చలపతి పని పైలావచ్చీనుగా ఉంది. పుష్కలంగా డబ్బు అందుతూంది. అప్పుడప్పుడు రాత్రిళ్లు కూడా తెనాలిలోనే మకాం పెడుతున్నాడు. మంగమ్మ అదేమని అడగడం లేదు. భద్రయ్య మీద కసి తీర్చుకుంటున్నందుకు మంగమ్మకు తృప్తిగా ఉంది. చలపతి పూలరంగడిలా తయా రయ్యాడు. గ్లాస్కో పంచె కట్టుకొని, బూట్లు వేసుకొని, కాళ్ళు ఎత్తెత్తి వేస్తూ నడుస్తూ ఉంటే ఆ ఊరివాళ్ళు నోళ్ళు తెరుచుకొని చూడసాగారు.

చలపతి మనసులో నుంచి గంగాభవాని బొమ్మ సినిమా రీలులా ఫేడ్ అవుట్ అయిపోయింది. మంగమ్మ కొడుక్కి రెండో పెళ్లి చేసే ప్రయత్నంలో ఉందని విన్న భద్రయ్య నిప్పులు తొక్కాడు.

'రెండో పెళ్లి చేస్తుందా? చెయ్యమను చూస్తా! అమ్మా కొడుకుల్ని జైల్లోకి తోయిస్తా.' రంకెలు వేశాడు భద్రయ్య.

'రెండో పెళ్లి' అన్న మాట విని గంగాభవానికి నవనాడులూ కుంగిపోయాయి. చేతిలో ఉన్న కోడి పెట్టను అమాంతం నేలకేసి కొట్టింది. కాళ్లకు చుట్టుకున్న పెంపుడు పిల్లిని కసితీరా తన్నింది. కసి కసిగా ఉంది. చలపతిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాలని ఉంది. మంగమ్మ నోటిమీద కసితీరా కొట్టాలని ఉంది. గంగాభవానికి అన్నం సహించడం లేదు. నిద్ర పట్టడం లేదు. గంగాభవాని గోడకు చేరబడి ఆలోచనల్లో మైమరచి ఉంది.

"పాత చీర ఒకటి ఇయ్యండమ్మగోరూ" అంటూ గణాచారి లోపలకు వచ్చింది. గంగాభవానికి కస్సున కోపం వచ్చింది. "చీరా లేదు గీరా లేదు. పో అవతలకు." కోపంగా అరచింది గంగాభవాని.

"ఏంది గంగమ్మ గోరూ అట్టా కసురుకొంటారూ? ఈ గణాచారి ముండకు మీరు కట్టి పారేసిన చీర ఇవ్వకూడదా? ఈ ఏడు ఏందోగానీ ఎవర్ని అడిగినా ఇట్టాగే కసురుకొంటున్నారు. ఆ పోలేరమ్మకు కూడా దయ కలగలేదు."

"ఆ పోలేరమ్మనే అడుగు పో." కసికసిగా అన్నది గంగాభవాని.

"పోలేరమ్మ తల్లి దయ లేకుండానే ఇంతకాలం బతికానా?" గొణుక్కుంటూ వెళ్ళిపోయింది నాంచారమ్మ.

ఒకరోజు సుబ్బయ్యగారి చిన్న కొడుక్కి కలరా వచ్చి రాత్రికి రాత్రే చచ్చిపోయాడనీ, ఆ రాత్రే హరిజనవాడలో ఇద్దరు చనిపోయారనీ నాంచారమ్మ చెవిన పడింది. వర్షాకాలం ప్రారంభంలో ఆ ఊళ్లో అలాంటి అంటువ్యాధులు రావడం మామూలే. రెండు రోజుల్లో పదిమంది దాకా కలరా సోకి చనిపోయారు.


మూడో రోజు ఉదయం పోలేరమ్మ గుడి ముందున్న వేపచెట్టుమీద నాంచారమ్మకు గణం పెరిగింది. జుట్టు విరబోసుకొని ఊగసాగింది.

"అద్దద్దా? ఆఁ-హాఁ! ఇరుచుకు తింటా! నలుసుకు తింటా!" అంటూ అరవసాగింది. ఊళ్లో ఈ వార్త పిడకల గూటి పొగలా వ్యాపించింది. జనం నాంచారమ్మ చుట్టూ చేరారు.

నాంచారమ్మ నెత్తిమీద బిందెల కొద్దీ నీళ్లు పోశారు. వేప మండలతో విసిరారు. సాంబ్రాణి పొగ వేశారు.

"ఏం జరిగింది తల్లీ? మా ఊరు ఎందుకొచ్చావ్?" చేతులు జోడించి అడిగాడు ఆ ఊరి పెద్ద.

"ఏం జరిగిందా? ఇంకేం జరగాలిరా! నన్ను మర్చిపోయార్రా! ఆఁ-హాఁ! అద్దద్దా! మిమ్మల్ని నలుసుకు తింటా!" నాంచారమ్మ చేతులు పక్కలకు విరుచు కుంటూ మునికాళ్ళ మీద లేచి నిల్చుంది.



"తల్లీ, అపరాధం జరిగింది. క్షమించు. ఇప్పుడు ఏం కావాలి?" అన్నాడు భక్తిపూర్వకంగా ఊరిపెద్ద.

"ఏం కావాలంటా వేందిరా? నాకు కడుపు నిండా తిండేది? ఒంటినిండా బట్టేది? ఆహారం కావాలి- కొలవండిరా! కొలుపులు కొలవండి." నాంచారమ్మ ఒంటిమీద అసలే చాలీ చాలని చీర ఉంది. దాన్ని మోకాళ్ళ పైకి లాక్కుంటూ చిందులు తొక్కడం ప్రారంభించింది.

"తల్లీ! అట్టాగే కొలుచుకుంటాం. శాంతించు తల్లీ!" జనంలో నుంచి అనేక కంఠాలు పలికాయి.

గణాచారి ఊగడం తగ్గింది. జనం బిందెలలో నీళ్లు గుమ్మరించారు. ఆ మధ్యాహ్నానికే ఆ ఊరికి డాక్టర్ల బృందం వచ్చింది. కలరా తగ్గుముఖం పట్టింది.

పోలేరమ్మ గుడిముందు కోళ్లూ, ఏటపోతులూ గిల గిల తన్నుకొన్నాయ్. గణాచారి నాంచారమ్మకు ఓ జత అద్దకం చీరెలూ, రవిక గుడ్డలూ ముట్టినయ్. కొలుపులు బ్రహ్మాండంగా జరిగాయి.

ఆ తెల్లవారి గణాచారి నాంచారమ్మ భద్రయ్య ఇంటికి వచ్చింది. గంగాభవాని దీర్ఘాలోచనలో ఉంది.

"గంగమ్మ గోరూ! ఇంత పచ్చడుంటే పెట్టండమ్మా!"

గంగాభవాని త్రుళ్లి పడింది. నాంచారమ్మను చూడగానే సంతోషంతో ఆమె ముఖం చేటంత అయింది. "రా! నాంచారమ్మా! రా! కూర్చో!" అన్నది గంగాభవాని ఆప్యాయంగా.

"నా తల్లి గదే! నీ కెంత కష్టం వచ్చింది తల్లీ. నా మాట విని ఆ పోలేరమ్మకు మొక్కుకో తల్లీ. ఒక చీరా, రైకా ఇస్తానని మొక్కుకో. నెల తిరక్కుండానే నీ భర్త నీ కాళ్ల మీద వచ్చి పడ్తాడు."

"ఒకటి కాదు, రెండు చీరలిస్తాను. నా కష్టం తీర్చమనవే!"

"మనసులో అనుకొని దణ్ణం పెట్టుకో తల్లీ."

గంగాభవాని లోపల కెళ్ళి విస్తరాకులో గోంగూర పచ్చడి తెచ్చింది. నాంచారమ్మ పైట చెంగు చాచింది. "నాంచారమ్మా?" "ఏమిటి తల్లీ?"

"ఆ రోజు గణం పెరిగినప్పుడు నిజంగా నీకు ఏమీ తెలియదా?" నాంచారమ్మ కళ్లలోకి లోతుగా చూసింది గంగాభవాని.

నాంచారమ్మ బిత్తరపోయింది.

"అదేంది గంగమ్మగోరూ అట్టా అడిగారూ? తప్పు! ఆ తల్లిని అనుమానించకూడదు."


"పోనియ్ ఇది చెప్పు. అలా ఎవరికైనా గణం పెరుగుతుందా?"

"అంతా ఆ తల్లి దయ. ఆ తల్లి మీద గురి ఉండాలి." మరో ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా నాంచారమ్మ వెళ్లిపోయింది. నాంచారమ్మ వెళ్లిన వైపే గంగాభవాని సాలోచనగా చూస్తూ నిలబడిపోయింది.

ఇంకా సంక్రాంతి పండుగ వారం రోజులుంది. అప్పుడే చీకటి పడుతోంది. తెనాలి బస్సు దిగి, చలపతి మామగారి వీథిన నడుస్తున్నాడు. బాగా అలసిపోయి ఉన్నాడు. అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నాడు. అల్లంత దూరంలో ఉన్న భర్తను చూసింది గంగాభవాని. తలుపు పక్కగా వీథి వాకిట్లో నిలబడింది. వీథిలో ఎవరూ లేరు.

ఈ పూట ఈయన సంగతేదో తేల్చుకోవాలి. అడుగో వస్తున్నాడు. వచ్చేశాడు. అరే! తన వైపు చూడడం లేదు. గంగాభవాని తలుపు బాదింది. అయినా అతడు తలెత్తి చూడలేదు. అటూ ఇటూ చూసింది. ప్రహరీగోడ మీద కూర్చున్న కోడిపెట్టను రెండు చేతులతో పట్టుకుంది. జాకెట్‌లో నుంచి చీటీ తీసి కోడి కాలికి చుట్టింది. వీథిలో తల వంచుకొని, కాళ్లీడ్చుకుంటూ పోతున్న చలపతి నెత్తిమీదకు విసిరింది.

కోడి "కిక్ కికొ" మంటూ చలపతి భుజం మీద వాలి, కిందకు దూకింది. దాని కాలికి చుట్టి ఉన్న ప్రేమ లేఖ కింద పడింది.



చలపతి వంగి ఆ చీటీ తీసుకొని వెనక్కు తిరిగి చూశాడు. కుక్కుట రాయబారం నడిపిన భార్యామణి వాకిట్లో ఒయ్యారంగా నిల్చుని వలపు చూపుల్ని ఓరగా విసురుతూ, చిరునవ్వులు చిందిస్తూ కనిపించింది. వచ్చీ రాని నవ్వొకటి భార్య ముఖం మీదకు విసిరి ముందుకు సాగిపోయాడు.

ఉత్తరం చదువుకొన్న చలపతి మనసు అడుసు తొక్కిన రేగడి మట్టిలా అయిపోయింది.

నాలుగు రోజుల పాటు మనసులోనే మథనపడిన చలపతి పండుగ రెండు రోజులు ఉందనగా తల్లితో అన్నాడు: "పండక్కు అత్తగారింటికి వెళ్తున్నానే అమ్మా!" నోరు తెరిచి కొడుకు ముఖంలోకి చూసింది.

చలపతి గిర్రున తిరిగి తన గదిలోకి వెళ్ళాడు.

"మళ్ళీ నీకిదేం బుద్ధిరా!" తల్లి మాట వెనకనుంచి వినిపించింది. చలపతి చేతిలో ఉన్న కండువా చేతిలోనే ఉండిపోయింది.

మంగమ్మ కొడుకు ముందుకు వెళ్ళి అడ్డంగా నిల్చుంది.

"నీకు పెళ్లాం కావాలో, అమ్మ కావాలో తేల్చుకో."

చలపతి చేతిలోని కండువాను కొయ్యపెట్టెలోకి విసిరి కొట్టాడు. మంగమ్మ విజయగర్వంతో కొడుకు జేబులో వంద రూపాయల నోటు కుక్కింది.

కళ్ళలో వత్తులు వేసుకొని భర్త కోసం ఎదురు చూస్తున్న గంగాభవానికి చలపతి తల వంచుకొని బస్ స్టాండు కేసి నడవడం కనిపించింది.

అంతే! కాళ్ళలో సత్తువ ఎవరో లాగేసినట్లు అయింది.

పోలేరమ్మ గుడి దగ్గర- మహాలక్ష్మమ్మ చెట్టు కింద-

"అద్దద్దా! అల్లల్లల్లా! అః- హూః!' మునివేళ్లమీద నిల్చుని జుట్టు విరబోసుకొని ఊగుతున్న స్త్రీ చుట్టూ జనం చేరారు. కడవలకొద్దీ నీళ్లూ - సాంబ్రాణీ పొగా - జనం రేదా తిరణాలలా ఉంది.

> **రాయబారం నడిపిన భార్యామణి వాకిట్లో ఒయ్యారంగా నిల్చుని వలపు చూపుల్ని ఓరగా విసురుతూ, చిరునవ్వులు చిందిస్తూ కనిపించింది.**

"తల్లీ, నువ్వు ఎవరివో చెప్పు?" అడిగాడు ఊరి పెద్ద.

"నీ కళ్లు పోయినయ్యట్రా? నేనెవరో తెలియడంలా? అద్దద్దా! విరుచుకు తింటా! నలుచుకు తింటా!"

"తెలిసింది తల్లీ. శాంతించు. మొన్ననేగా కొలుపులు కొలుచుకున్నాం" అన్నాడు ఒక పెద్దమనిషి.

"నా భక్తురాలికి అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకుంటానా! మీ గొడ్డూ గోదా నమిలేస్తాను."

"క్షమించు తల్లీ. ఇప్పటికే ఊళ్లో ఎన్నో పశువులు గాలికుంటు వ్యాధికి బలి అయ్యాయి. చెప్పు తల్లీ. నీ భక్తురాలు ఎవరు?" అడిగాడు జనంలో నుంచి మరో పెద్దమనిషి. "అద్దద్దా! అః- హూః!" పూనకం తారస్థాయిని అందుకొన్నది.

ఇదంతా చూస్తున్న నాంచారమ్మకు మతి పోయినంత పని అయింది. అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది.

"అమ్మా! పోలేరమ్మ తల్లీ! నీ భక్తురాలు ఎవరు చెప్పు తల్లీ!" నాంచారమ్మ తెప్పరిల్లి అడిగింది.

"గంగాభవాని!" పళ్లు పటపట కొరికింది.

చాలా మంది ముఖముఖాలు చూసుకొన్నారు.

"ఆమెకు జరిగిన అన్యాయం ఏమిటో చెప్పు తల్లీ" అడిగింది నాంచారమ్మ.

"ఏడీ? వాడేడీ? ఆ చలపతి ఏడీ? ఆ మంగమ్మ ఏదీ? ఎక్కడ?"

జనాన్ని తోసుకుంటూ భద్రయ్య ముందుకు వచ్చాడు.

"ఏమిటిది? రా ఇంటికి పోదాం" అన్నాడు.

"ఆ(- ఎవడివిరా నువ్వు? నువ్వా? నీ ఇంట్లో పడి తినడం మొదలుపెట్టానురా! నీ గొడ్లు రెండు చచ్చాయి. ఇంకా చస్తాయి. నన్ను ఇంటికి పిలుస్తున్నావా?" గుడ్లు ఉరిమింది గణం పెరిగిన గంగాభవాని.

భద్రయ్యకు ఒళ్ళు జలదరించింది.

"తల్లీ, శాంతించు." చేతులు జోడించాడు భద్రయ్య.

"ఇంకెక్కడి శాంతిరా? ఆ చలపతిగాడిని ఈడ్చుకురండి. నలుచుకు తింటా."

జనంలో నుంచి ఒక్కొక్కరే చిన్నగా తప్పుకున్నారు.

మూడు రోజుల నుంచి పోలేరమ్మ గుడి ముందు చెట్టుకింద దిమ్మెమీద బైఠాయించింది గణం పెరిగిన గంగాభవాని.

గణాచారి నాంచారమ్మా, తల్లీ, తండ్రీ ఆమెను కనిపెట్టుకొని ఉన్నారు.

> మంగమ్మ కోడలి నెత్తిన రెండు కడవల నీళ్ళు పోసి, వేపమండలతో విసిరింది. సొమ్మసిల్లి పడిపోయింది గంగాభవాని.

మొదటి మూడు రోజులూ ఊళ్లో వాళ్లు గంగాభవాని గురించి చిత్రంగా, హేళనగా చెప్పుకొన్నారు.

ఈ వార్త పక్క ఊళ్ళకు పాకింది. ఊళ్లో వాళ్ళకంటే పొరుగూళ్లో వారికే భక్తిశ్రద్ధలు ఎక్కువయ్యాయి.

ఊళ్లోను, చుట్టు పక్కల ఊళ్లలోను గొడ్ల జబ్బులు ఎక్కువయ్యాయి.

గంగాభవానికి సహాయంగా చుట్టుపక్కల ఊళ్ళ గణాచారులంతా అక్కడ చేరారు. ప్రతి నిమిషం వాళ్లలో ఎవరో ఒకరికి గణం పెరుగుతూనే ఉంది. ఊళ్ళో వాళ్లు భయపడిపోయారు. పోలేరమ్మ గుడికి నరఫరాలు చేరుతున్నాయి. అక్కడే వంటలూ, నైవేద్యాలూ చెల్లిపోతున్నాయి.

తప్పెట్లూ, తాళాలూ, భజనలూ - ఊరంతా హోరెత్తిపోతున్నది.

గణాచార్ల మధ్యలో గంగాభవాని కూర్చుని ఉన్నది. దిమ్మెమీద ఎత్తుగా కూర్చున్న ఆమె గ్రామ దేవతల పెద్దలా కనిపిస్తున్నది.

నాలుగో రోజు ఊళ్ళో పెద్దలంతా వెళ్ళారు.

"ఏం చెయ్యమంటావు తల్లీ?"- చేతులు జోడించి అడిగారు.

"వాణ్ణి- ఆ చలపతిగాణ్ణి లాక్కొచ్చి నా కాళ్ళమీద పడెయ్యండి..." అన్నది. ఊరు ఊరంతా ఏకమై మంగమ్మ ఇంటిమీద పడింది.

"అన్నీ దొంగ ఎత్తులు. టక్కులమారి ముండ." మొదటి రెండు రోజులూ మంగమ్మ కోడల్ని దుమ్మెత్తి పోసింది. మూడో రోజుకు మంగమ్మ నోటికి తాళం పడింది. ఆ రాత్రి మంగమ్మకు జ్వరం వచ్చింది. గొడ్లు చచ్చిపోయిన వాళ్ళంతా మంగమ్మను శాపనార్థాలు పెట్టారు.

ఇక చలపతి పని సరేసరి! మతి పోయినట్లయింది. ఇంట్లో దూరి, బయటి ముఖం చూడకుండా నిండా ముసుగు పెట్టుకొని పడుకున్నాడు.



తప్పెట్లూ, తాళాలూ, రణగొణధ్వని మంగమ్మ ఇంటికి దగ్గరౌతున్నాయి. మంగమ్మా, చలపతీ భయంతో వణకిపోతున్నారు.

జనం ఇంటి ముందుకు వచ్చి పడ్డారు. గణాచారులు "చలపతీ, బయటికి రారా!" అంటూ అరిచారు.

తలుపులు తోసుకొని ఊరిపెద్దలూ, గణాచారులూ లోపలకు జొరబడ్డారు.

మంగమ్మ ఏదో అంటున్నది. జనం అరుపుల్లో మంగమ్మ గొంతు కలిసిపోయింది.

ఇద్దరు వ్యక్తులు చలపతిని రెక్క పట్టుకొని లాగి నిల్చోపెట్టారు. చలపతి ఊరేగింపులో ముందు వరసలో పిల్లిలా నడుస్తున్నాడు. గుంపులో పడి మంగమ్మ నడుస్తున్నది. ఊరేగింపు పోలేరమ్మ గుడి ముందుకు వచ్చింది.

ముందు వరసలో ఉన్న చలపతిని చూసి గంగాభవాని అపర కాళిలా లేచి నిల్చుంది. కళ్ళు ఎర్ర చేసింది. పళ్లు పటపట కొరికింది.

పక్కన ఉన్నవాళ్ళు చలపతి చేతికి నీళ్ళ కడవలు అందిస్తున్నారు. చలపతి పైపంచె నడుముకు బిగించి ఐదు కడవల నీళ్ళు ఆమె నెత్తిన పోశాడు. సాంబ్రాణీ పొగ వేసి, వేపమండలతో విసిరాడు.

గంగాభవానిలో ఉధృతం తగ్గింది. గట్టిగా గాలి పీల్చి "ఎవడ్రా నువ్వు?" అన్నది.

"నేనే! చలపతిని. నీ భర్తను."

"ఏం కూశావురా? నువ్వు నా భర్తవా?" పళ్ళు కొరికింది గంగాభవాని.

"కాదులే. గంగాభవాని భర్తను - చలపతిని."

"అట్టా చెప్పరా. గంగాభవాని నా భక్తురాలు. దాన్ని ఎందుకురా వదిలేశావ్?" గుడ్లు ఉరిమింది.

"తప్పే! క్షమించు. ఇకనుంచి నా భార్యను ప్రేమగా చూసుకుంటాను. మా ఇంటికి తీసుకెళ్తాను" అన్నాడు చలపతి భయం భయంగా.

"మాట తప్పావా నాలుక చీరేస్తా!"

"శాంతించు తల్లీ. మా గొడ్డూ గోదను నల్లగా చూడు. ఇకనుంచి చలపతి నువ్వు చెప్పినట్టే నడుచుకుంటాడు." జనంలోనుంచి అనేక కంఠాలు వినిపించాయి.

"ఏయ్ చలపతీ! మీ అమ్మ- ఆ మంగిముండ ఏదిరా?" బుసలు కొట్టింది గంగాభవాని.

జనం మంగమ్మను ముందుకు తోశారు.

మంగమ్మ కోడలి నెత్తిన రెండు కడవల నీళ్ళు పోసి, సాంబ్రాణీ పొగ వేసి, వేప మండలతో విసిరింది.

ఓరకంటితో అత్తను ఓసారి చూసి సొమ్మసిల్లి పడిపోయింది గంగాభవాని.

జనం వెంటరాగా మంగమ్మా, చలపతీ గంగాభవానిని ఇంటికి తీసుకొచ్చారు.

రెండు రోజులుగా వెటర్నరీ డాక్టర్లు గొడ్లకు చికిత్స ప్రారంభించారు. అంటువ్యాధులు చాలావరకు అప్పటికే తగ్గుముఖం పట్టాయి.

సంవత్సరం గిర్రున తిరిగింది.

పండంటి కొడుకును ఎత్తుకుంది గంగాభవాని.

పండుగ రోజు గణాచారి నాంచారమ్మకు ఒడి నిండా పిండివంటలు పెట్టి, కొత్త చీర కూడా ఇచ్చింది గంగాభవాని.

"ఇదేమిటమ్మాయిగోరూ! ఈ గణాచారిముండ మీద ఇంత దయ పుట్టుకొచ్చింది?"

"నిజమే నాంచారీ! ఇదంతా నీ చలవే!"

"మధ్య నేనేం చేశాను తల్లీ?"

"అట్టా అనకు."

"అమ్మాయిగోరూ! మీరు చాలా బాగా..."

"నువ్వూ అంతేనా?"

గణాచారి సమాధానం చెప్పకుండా ముసిముసిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. ●